క్లుప్తంగా

ఎంఈవో-2గా గొల్లవాడు



ఎంఈవో గొల్లవాడుకు అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

హిరమండలం: మండల విద్యాశాఖాధికారి-2గా బి.గొల్లవాడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న గొల్లవాడు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అందరి సహకారంతో మండల విద్యాభివృద్ధికి తోడ్పాడతానని తెలిపారు. ఆయనను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అధార్ నమోదు వేగవంతం చేయాలి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో నీరజ

కొత్తూరు: అధార్ కార్డుల నమోదు వేగవంతం చేయాలని ఎంపీడీవో నీరజ ఆదేశించారు. స్థానిక అధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. అధార్ నమోదుకు వచ్చిన వ్యక్తులకు అసౌకర్యం కలగకుండా పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఆర్ఆర్ కాలనీలో సీసీ రోడ్లు, ఒండ్రుజోలలో నిర్మించిన మినీ గోకులాన్ని పరిశీలించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని ఉపాధి అధికారులను ఆదేశించారు.

సీడీపీవోపై తప్పుడు ఫిర్యాదులు సరికాదు



మాట్లాడుతున్న అంగన్వాడీ సెక్టర్ అధ్యక్షులు, కార్యకర్తలు

పాతపట్నం: స్థానిక అంగన్వాడీ ప్రాజెక్టు సీడీపీవో టి.విమలరాణిపై తప్పుడు ఫిర్యాదులు సరికాదని పాతపట్నం ప్రాజెక్టు సెక్టర్కు చెందిన అంగన్వాడీ కార్యకర్తల అధ్యక్షులు బి.శాంతామణి, కె.నారాయణమ్మ, యు.రాణి, డి.లలిత, యు.లీలారాణిలు అన్నారు. స్థానిక శివ శంకర్ కాలనీ 2వ లైన్లో ఉన్న అంగన్వాడీ కేంద్రం వద్ద బుధవారం విలేకరులతో మాట్లాడారు. తాము చెప్పామని ఎవరో కె.టి.కృష్ణారావు పేరుతో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలకు తప్పుడు ఫిర్యాదులు చేశారని, అవి వాస్తవం కాదన్నారు. దీనిపై ఈనెల 9వ తేదీన ఆర్జేడీ అడిగారని, ఫిర్యాదుతో మాకు ఎటువంటి సంబంధం లేదని చెప్పామన్నారు. సీడీపీవో తమను ఇబ్బందులు పెట్టడంలేదని తెలిపామన్నారు. సమావేశంలో డి.శ్రీలక్ష్మి, కుసుమ, కళావతి, కె.సుజాత, ఎస్.రమాదేవి, ఎస్.శారద, జి.గీతారాణి పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కంటి వైద్య పరీక్షల్లో భాగంగా 30 మందిని కంటి శస్త్ర చికిత్సకు రిఫర్ చేసినట్లు శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కో-ఆర్డినేటర్ కె.రామారావు తెలిపారు. బుధవారం ఎంపీ రామ్మోహన్నాయుడు పుట్టిన రోజు సందర్భంగా సైలాడ సతీష్, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాతపట్నం, చంగుడి, కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామానికి చెందిన కంటి రోగులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి చదువుతున్న పది మంది విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్టు ఆర్థిక సాయంతో హెచ్ఎం ఎ.గోవిందరావు ఉపకార వేతనాలను బుధవారం అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.వేయి చొప్పున రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నరసన్నపేట: మండలంలోని సత్యవరం నుంచి లకిమేర మీదుగా 16వ నంబర్ జాతీయ రహదారి వరకూ రూ.1.50 కోట్లతో చేపట్టిన రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ ఆరంగి మురళి కోరారు. మండల ఇంజినీర్ నర్సింగరావు, కాంట్రాక్టర్ రఘురాంలతో కలిసి రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. త్వరితగతిన రోడ్డు పూర్తి చేయిస్తామని జేఈ పేర్కొన్నారు. ఆయనతో పాటు పంచాయతీ వార్డు సభ్యుడు నీలం రాజు తదితరులు ఉన్నారు.

- పీహెచ్సీల్లో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు
- రోడ్డునపడిన కుటుంబాలు
- 20 ఏళ్లుగా సేవలందిస్తున్నా కనికరం చూపని వైనం
- మరోవైపు రోగులకు అందని సేవలు

ఖ్చే..!



ఉపాధి వేతనదారులకు వైద్య సేవలపై అవగాహన కలిగిస్తున్న ఎంపీహెచ్ఏ(ఫైల్)

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కొత్త ఉద్యోగాల భర్తీ లేకపోయింది సరికదా, ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. దీంతో ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వైద్యారోగ్య శాఖలో 21 ఏళ్లుగా వివిధ పీహెచ్సీలో మల్టీ పర్పజ్ హెల్త్ అసిస్టెంట్లు(ఎంపీహెచ్ఏ)గా పనిచేస్తున్న వారిని కోర్టు ఉత్తర్వులు బూచిగా చూపి నిర్లక్ష్యంగా ప్రభుత్వం తొలగించింది. దీంతో గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్న హెల్త్ అసిస్టెంట్లు రోడ్డునపడ్డారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 123 మందిని తొలగించగా, వీరిలో నరసన్నపేట నియోజకవర్గం నుంచి 21 మంది ఉన్నారు.

ప్రాణాలకు తెగించి సేవలు

హెల్త్ అసిస్టెంట్లు కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారు. అలాగే వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ మేమున్నామంటూ స్పందించేవారు. అదేవిధంగా వ్యాధి నిరోధక టీకాలు, పల్స్ పోలియో, ఇతర సర్వేల నిర్వహణలో ముందుండేవారు. కానీ ఇప్పుడు ఒక్కసారి ఉద్యోగాలు కోల్పోవడంతో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోయే అవకాశం ఉంది. వీరిలో ఎక్కువ మంది దాదాపు 20 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు.

తొలగించిన ఎంపీహెచ్ఏలు

పీహెచ్సీ	సంఖ్య
మాకివలస	06
అచ్యుతాపురం	02
పోలాకి	04
గప్పెడిపేట	03
సారవకోట	02
జలుమూరు	01
ఫైలేరియా యూనిట్	03

దీంతో ప్రస్తుతం 50 ఏళ్లు పైబడినవారు అవ్వడంతో ఇప్పుడు మరో ఉద్యోగంలో చేరే అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇదివరకు పలు మార్లు ప్రభుత్వాలు తమను పర్మినెంట్ చేస్తాయని హామీ ఇచ్చినా జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను మరలా విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్య సేవలకు అంతరాయం

మరోవైపు ఒక్కసారిగా నియోజకవర్గంలో పనిచేస్తున్న 21 మంది మల్టీపర్పజ్ హెల్త్ అసిస్టెంట్లను తొలగించడంతో ఆయా సబ్ సెంటర్లలో పూర్తిగా వైద్య సేవలు నిలిచిపోయాయి. ఏఎన్ఎంలు ఉన్నా వారి సేవలు పరిమితంగానే ఉంటాయి. మాకివలస, గుప్పెడిపేట, పోలాకి, అచ్యుతాపురం వంటి పీహెచ్సీల్లో అధిక మంది తొలగించబడ్డారు. దీంతో ఈ పీహెచ్సీల్లో సేవలు ప్రస్తుతం అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలకు వైద్యం అందక ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. దీంతో ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదుకోవాలి



కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి కుటుంబాలను పక్కన పెట్టి పనిచేశాం. అలాగే గడిచిన 20 ఏళ్లుగా పనిచేస్తున్నాను. ప్రభుత్వ కాలేజీలో మల్టీపర్పజ్ హెల్త్ అసిస్టెంటుగా శిక్షణ పొందాను. ఇప్పుడు ఇలా అర్ధాంతరంగా తొలగించడం సరికాదు. ఈ వయస్సులో మరో ఉద్యోగంలో ఎలా చేరగలను. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియడం లేదు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

– ఆర్.రామచంద్రరావు, నడగాం

ఉద్యోగాల్లోకి తీసుకోవాలి



నేను 2006లో ఉద్యోగంలో చేరాను. ఇప్పటికి 18 ఏళ్ల సర్వీసు పూర్తయ్యింది. ప్రస్తుతం నాకు 50 ఏళ్లు వచ్చాయి. ఎవరో చేసిన పనికి కోర్టు ఆదేశాల నెపంతో ఇలాంటి సమయంలో ఉన్నట్టుండి ఉద్యోగం నుంచి తీసేశారు. మేము ఎలా బతకాలి, మాకు మరో ఉద్యోగం ఎవరు ఇస్తారు అనేది ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. వెంటనే మమ్మల్ని మరలా ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరుతున్నాం.

– గంగు కృష్ణారావు, నరసన్నపేట

హక్కులపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



మెళియాపుట్టి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ చలం

హిరమండలం: వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరమని మండల వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు ఏవీ సురేష్ అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీరామేశ్వరి డిగ్రీ కళాశాల, శ్రీరామ జూనియర్ కళాశాలల్లో వినియోగదారుల హక్కులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం తీసుకునే ప్రతీ వస్తువు నాణ్యతను పరిశీలించాలన్నారు. అలాగే అన్ని వస్తువులకు తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆర్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మోసాలను అరికట్టేందుకు వినియోగదారులకు అవగాహన అవసరమని కన్స్యూమర్ క్లబ్ మాస్టర్ ట్రైనర్ ఎల్వీ చలం అన్నారు. మండలంలోని కరజాడ జెడ్పీ పాఠశాల విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై అవగాహన



మాట్లాడుతున్న డీఏవో త్రినాథస్వామి

పోలాకి: జిల్లాలోని రబీ పంట కాలంలో ఆరుతడి పంటలను ప్రోత్సహిస్తూ వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వ్యవ సాయశాఖ అధికారి త్రినాథస్వామి అన్నారు. మండలంలోని గొల్లలవలసలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించారు. అలాగే ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటను భద్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవీంద్రభారతి, ఏవో చిరంజీవి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని కొల్లివలస, గుత్తావల్లి, బూర్జ గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో ప్రత్యేక తనిఖీ అధికారి జి.సత్యవతి ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 100 రోజులు పైబడి ఆన్లైన్లో అమ్మకాలు చూపించని దుకాణాల్లో స్టాకు, రికార్డులు పరిశీలించినట్లు తెలియజేశారు. ఆమెతో పాటు ఏవో ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

మహిళలను చైతన్యవంతం చేయడమే లక్ష్యం



కుట్టుమిషన్లతో మహిళలు

ఆమదాలవలస: మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడమే న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ముఖ్య ఉద్దేశమని ఆ సంస్థ డైరెక్టర్ కె.శ్యామ్ మాథ్యూస్ అన్నారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని ఏడో వార్డు చింతాడలో న్యూ లైఫ్ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి ప్రాంగణంలో నడపబడుతున్న న్యూ లైఫ్ టైలరింగ్ శిక్షణా కేంద్రంలోని మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు స్వయం సాధికారత సాధించాలన్నారు. ఆరు నెలల కాలం పాటు తమ సంస్థలో టైలరింగ్ విభాగంలో శిక్షణ పొందిన తొమ్మిదో బ్యాచ్ మహిళలకు ఆర్థికంగా చేయూతనందిస్తూ కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం న్యూ లైఫ్ టైలరింగ్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాస్టర్ జి.కృపావరం మాట్లాడుతూ ఎంతోమంది మహిళలు టైలరింగ్ ద్వారా ఉపాధి పొందుతూ వారి కుటుంబాలను సంరక్షించుకుంటున్నారన్నారు.

అన్నదాత ఆందోళన



వరుస తుఫాన్లతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. అల్పపీడనం కారణంగా బుధవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు పడుతుండడంతో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు, మరోవైపు మిల్లర్లు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం మిల్లుల వద్ద పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు ఉన్నాయి. అలాగే రైతులు కూడా రోడ్లు వెంబడి ధాన్యం నిల్వలు ఉంచారు. వర్షాలు పెరిగితే ధాన్యం తడుస్తాయనే ఆందోళన నెలకొంది. వరుణ దేవుడు కరుణించాలని కోరుతున్నారు.

– సాక్షి నెట్వర్క్

సరుబుజ్జిలి: ధాన్యం బస్తాలు తడవకుండా టార్పాలిన్లు కప్పిన రైతులు



మెళియాపుట్టి: పద్ద గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు



ఎల్.ఎన్.పేట: జాడుపేట వద్ద వరిచేను కుప్పపై టార్పాలిన్లు కప్పిన రైతులు



నరసన్నపేట: జమ్ములో రైస్మిల్లు వద్ద ధాన్యంపై టార్పలిన్లు కప్పుతున్న దృశ్యం



జలుమూరు: పొలాల్లో వరిచేను కుప్పలుగా పెట్టిన రెతులు



జలుమూరు: కల్లాలో ధాన్యాన్ని పరదాలు కప్పి రక్షించుకుంటున్న రైతులు



సారవకోట: దాసుపురంలో ధాన్యం ట్రాక్టర్ ఎక్కిస్తున్న హమాలీలు

నిరుపయోగం



సారవకోట మండలంలోని మదనాపురం పంచాయతీ జరాళి, చంద్రయ్యపేట గ్రామాల మధ్య నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది. ఈ రెండు గ్రామాలకు ఉమ్మడిగా కొండ ప్రాంతంలో దీనిని నిర్మించారు. అయితే ఈ రెండు గ్రామాల్లో సేకరించిన చెత్త ఇక్కడ వేసేందుకు దూరంగా ఉండడంతో, నిర్మించిన నాటి నుంచి నేటివరకు ఒక్కసారి కూడా వినియోగించిన దాఖలాలు లేవు. దీంతో ప్రస్తుతం ఆ షెడ్ శిథిలావస్థకు చేరుకుంది.

– సారవకోట

మంచు దుప్పటి



వాతావరణంలో మార్పుల కారణంగా మెళియాపుట్టి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో విపరీతమైన మంచు కురుస్తోంది. బుధవారం ఉదయం 10 గంటల వరకు వానలా కురుస్తున్న మంచు ధాటికి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే చలికూడా విపరీతంగా ఉండడంతో చిన్న పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

– మెళియాపుట్టి

ముమ్మరంగా వరినాట్లు



జలుమూరు మండల కేంద్రంతో పాటు కోనసింహాద్రిపేట, మాకివలస, పాగోడు, వెలుసోద, కరవంజి, గుగ్గిలి, కొత్తపేట తదితర గ్రామాల్లో రబీ సీజన్కు సంబంధించిన వరినాట్లు ముమ్మరంగా చేపడుతున్నారు. వంశధార ఎడమ కాలువ నీరు సదుపాయంతో పాటు, సాగునీటి చెరువులు ఉండడం వలన రైతులు రెండో పంటకు సమాయత్తమయ్యారు. తేలికపాటి ఆర్ఎన్ఆర్ రకంతో మార్చి నాటికి పంట చేతికి అందుతుందని రైతులు చెబుతున్నారు.

– జలుమూరు

వేడుకలను విజయవంతం చేయండి



నాయకులతో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఈనెల 21వ తేదీన విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కోరారు. పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆరోజు అన్నిచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, కేసీహెచ్బీ గుప్త, రాజాపు అప్పన్న, దండి జయప్రకాశ్, కణిత కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతే సంఘాలకు బలం

జలుమూరు: ఉద్యోగుల ఐక్యతే సంఘాలకు బలమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.అప్పల నాయుడు అన్నారు. బుధవారం జలుమూరు పంచాయతీ గ్రేడ్ ఒకటి నుంచి ఐదు వరకూ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక సమావేశంలో మాట్లాడారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా ఎం.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.చిన్నారావు, సాధారణ కార్యదర్శిగా ఎం.హరీష్, ట్రెజరర్గా డి.గోపిక, వర్కింగ్ ప్రెసిడెంట్గా ఐ.అప్పారావు, ఆర్గనైజర్ కార్యదర్శిగా ఎన్నికైన పి.అరుణతోపాటు మెంబర్లను అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి పి.ఉమామహేశ్వరరావు, సీనియర్ కార్యదర్శి జయబాబు తదితరులు పాల్గొన్నారు.

యేసు బోధనలు విశ్వవ్యాప్తం



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్ల ఫ్యామిలీలు

సరుబుజ్జిలి: యేసు క్రీస్తు బోధనలు విశ్వవ్యాప్తంగా విస్తరించాయని ఆమదాలవలస హౌస్ ఆఫ్ ప్రేయర్ వ్యవస్థాపకులు అరుణ్కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పెంతుకోస్తు చర్చిలో క్రిస్టియన్ మ్యారేజెస్ జిల్లా రిజిస్ట్రార్ ప్రత్తిపాటి ప్రసాదరావు అధ్యక్షతన బుధవారం పాస్టర్స్ ఫ్యామిలీ ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దైవజనులు వర్తమానికులు డాక్టర్ బర్నబాస్బింకం అయ్యంగార్ వాక్యాన్ని అందించారు. క్రిస్మస్ కేక్ కట్చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పాస్టర్లు శామ్యూల్ జాన్, షడ్రక్, విజయప్రసాద్, ప్రభుదాసు, సంపోను, రమేష్, కృష్ణ, ఇసాక్ ఇజ్రాయిల్, శ్యామ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సరుబుజ్జిలి:

స్థానిక సబ్స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్కో ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ సరుబుజ్జిలి, రొట్టవలస, యరగాం ఫీడర్లలో మరమ్మతుల వలన మర్రిపాడు, కొత్తకోట, రొట్టవలస నుంచి పురుషోత్తపురం, కేజేపేట నుంచి యరగాం, వెన్నెలవలస, చిగురువలస, గోనెపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ప్రకటించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పోలాకి: మండలంలోని పిన్నింటిపేట సబ్స్టేషన్ పరిధి పిన్నింటిపేట వ్యాపార కేంద్రం, పరిధిలోని ఆక్వా సర్వీసులకు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్కో ఏఈ శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్హెచ్క్యూ ఫీడర్ పునరుద్ధరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అంతరాయాన్ని ఆక్వా రైతులు, వ్యాపారులు, వినియోగదారులు గమనించాలని కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

హిరమండలం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది. ఈ నేపథ్యంలో మండల వ్యవసాయ శాఖాధికారి బి.సంధ్య స్థానిక రైతులను అప్రమత్తం చేశారు. వాతావరణంలో మార్పుల కారణంగా రైతులు నూర్పులు వాయిదా వేసుకోవాలని సూచించారు. పొలాల్లో, కల్లాల్లో ఉన్న వరి చేలు, ధాన్యం బస్తాలకు రక్షణ కల్పించాలన్నారు. వాతావరణ హెచ్చరికలు ఉన్న క్రమంలో ముందస్తు చర్యలపై సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.